# దైవత్వం

-పారీనంది నిర్మల

వదినా...

వదినా... బార్లీ కాస్త తాగు. ఇంద జాగ్రత్తగా లేచి తాగు. నేను మధుబాబుని తయారుచేసి స్కూల్‌కి దిగపెట్టేసాను. అన్నయ్యకి టేబుల్‌పైన భోజనం వడ్డించేసాను. టిఫిన్ కట్టి బేగ్‌లో పెట్టేసాను. నువ్వు వాళ్ళ గురించి వర్రీ అవ్వద్దు. వాడలా చెప్తుకుంటూ పోతూంటే...

నేను వాడి వైపు చూస్తూ మనసారా దీవిస్తూ ఇది ఏ జన్మ రుణమో అడక్కుండానే తీర్చుకుంటున్నాడు. మాపైన ఎంత అభిమానమో, ఎలా ముగించుకున్నాడు. ఇంటి పనంతా. మళ్ళీ ఇక్కడికి నా సేవకు సిద్ధం. ముఖంపైన అలసట గాని, విసుగు గాని అసలు కనపడడం లేదు.

వాడు యాంత్రికంగా కొబ్బరి బొండాంలో చిల్లు పొడిచి నీళ్ళు గ్లాసులోకి వేసి "వదినా! ఇవిగో కొబ్బరి నీళ్ళు. ఇవి తాగితే నీరసం పోతుంది. తొందరగా తాగు నాకు ఆలస్యం అవుతుంది".

ఇహ నేను మాట్లాడకుండా తాగేసాను. లేకుంటే వాడు అక్కడ నుండి కదలడు. ఈ లోగా వాడు టిఫిన్ కేరియరు, బార్లీ నీళ్ళు అన్నీ అలమారులో పెట్టేసాడు. నావి విడిచిన బట్టలు, తిన్న సామాన్లు బేగ్‌లో పెట్టేసుకున్నాడు. "నేను పన్నెండు గంటలకు మళ్ళా వస్తాను" అని ఆసుపత్రి బయటికి వచ్చేశాడు. దరిదాపు పది రోజుల నుండి నా సేవ చేస్తున్నాడు. వాడు సైకిల్‌పై వెళుతుండగా చూస్తూ ఆలోచిస్తుండి పోయాను.

ㅇ ㅇ ㅇ

హోటల్ ఉద్యోగం మానేసి దరిదాపు రెండు నెల్లు కావచ్చింది. హోటల్ లీజు డీల్‌లో మాటిమాటికి హైదరాబాదు వెళ్ళవలసి వస్తూండేది తన ఫ్రెండ్‌తో. అతడు ఇక్కడ ఒక హోటల్ మేనేజర్. డీల్ ఎగ్రిమెంట్ ఏమిటంటే తను తెచ్చిన పార్టీ డీల్ అయినప్పుడు 2% కమిషన్ మొత్తం పైన దొరుకుతుంది. ఆ డబ్బుతో దుబాయి వెళదామని. అక్కడ వాడి ఫ్రెండ్ ఉద్యోగం కూడా ఇప్పిస్తానన్నాడు కాని ఈ డీల్ ఒక కొలిక్కి రావడం లేదు. రెండు వైపులా నష్టపోయింది వీడే. ఇటు ఉద్యోగం పోయింది అటు డీల్ కుదరటం లేదు. ఎవరైనా ముప్పై వేలిస్తే దుబాయి వెళ్ళిపోయి అక్కడ నుండి రెట్టింపు పంపడానికి రెడీగా వున్నాడు గాని ఎవరూ అంత రిస్క్ తీసుకుందుకు రెడీగా లేరు. ఈ విషయం మావారితో చెప్పినప్పుడు ససేమిరా ఒప్పుకోలేదు. ఎందుకంటే ఒకమారు పదివేలు తీసుకొని ముంబాయికి వెళ్ళి వట్టి చేతులతో తిరిగొచ్చాడు. "తరువాత వాడితో కచ్చితంగా చెప్పు. ఈ లజ్జుగుజ్జు వ్యవహారంలో పడవద్దని. ఇక్కడే ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోమను. ఇలా ఎప్పటి వరకు ఖాళీగా వుంటాడు". మా వారి మాటల్లో కూడా నిజం లేక పోలేదు. ఈ మధ్యనే మేము ఇల్లు బాగు చేయించుకున్నాము. దానివల్ల అప్పుల్లో కూరుకు పోయాం. యాభై వేలు కేవలం వడ్డీయే చెల్లిస్తున్నాము. పై పెచ్చు టాక్సు కూడా కట్టుకోవాలి. ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే మళ్ళా ముప్పై వేలు ఎక్కడ నుండి తెస్తారు. అదే కాకుండా ఉద్యోగం వెతకడం కోసం రోజుకు 20 రూపాయలు టౌను వెళ్ళి రావటాన్కి ఇవ్వాలి. ఓ మాటలో చెప్పాలంటే నేను విసిగి పోయాను.

ఔను. నేనో మాట చెప్పడం మరిచాను. రమేష్ అసలు మా ఇంటికి ఏ పరిస్థితుల్లో వచ్చేడో... రమేష్ ఒక హోటల్ టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తుండే వాడు. అక్కడ ఒక బెంగాలీ కుక్‌తో ఫ్రెండ్‌షిప్ కుదిరింది. ఐతే వాడు ఇంటి ఖర్చుకి జీతం మొత్తం ఇచ్చేవాడు కాదు. దానితో మాటామాటా పెరిగి తల్లీ, అక్కలు, రెండో అన్నయ్య వాడ్ని ఇంట్లోంచి పంపించేసారు. ఐతే పౌరుషంతో ఆ కుక్ ఇంటిలో బస చేసేవాడు. అన్నిరకాల వంటలు అతనితోపాటు వుండి బాగా నేర్చుకున్నాడు గాని దురదృష్టం అక్కడా వెంటాడింది. ఆ కుక్‌కి ట్రాన్స్‌ఫరైంది. మరో గత్యంతరం లేక మా వద్దకి పెట్టీ బేడాతో దిగిపోయాడు. మాకు బాధ వేసింది. సంతోషమూ వేసింది. మేము ముగ్గురము వాడు నాలుగోవాడు. అదే కాకుండా మా మధుకి మంచి కంపెనీ.

నేను కీళ్ళ వాతంతో చాలా బాధపడే దాన్ని. పైగా ఎనిమిది గంటలకు ఇంటిల్లిపాది బయటకు తాళం వేసుకుని పోవలసిందే. ఇంటి పని పూర్తి చేసుకొని తెమలడం అంటే దినదినగండంలా వుండేది. తొందర వల్లనో లేక శారీరక అస్వస్థత వల్లనో ఏదైతేనేం అప్పుడప్పుడు ఉడికీ ఉడకని భోజనం తినవల్సి వచ్చేది. అదే కాకుండా ఉప్పు విషయంలో ఐతే అతివృష్టి అనావృష్టి. ఇది చూసి రమేష్ ఉండబట్టలేక ఒక నాడు

"వదినా! నువ్వు పర్మిషనిస్తే నేను కూర, పచ్చడి అవి చేసేస్తాను. నేను సరేనని తలూపాను. ఇంట్లో వున్నంత సేపు టిఫిన్లు వంటకాలు లేకపోతే సైకిల్‌పైన మధుని కూర్చోపెట్టి బయటకు వెళ్లడం. ఐతే మా ఇద్దరికీ వాడు ఇంట్లో అలా వుండి పోవడం నచ్చేదికాదు. అర్ధరాత్రి వరకు టివిలో కార్యక్రమాలు. దొంగచాటున సిగరెట్స్ కరెంటు బిల్లు మాట అటు వుంచితే మధు కూడా అంతంత సేపు టివి చూడడం (అప్పుడప్పుడు) మాకు నచ్చేది కాదు. ఐనా నాకు వాడి మీద దయ వచ్చేది. ఇంట్లో వాళ్ళు వాడ్ని గెంటేసినప్పుడు మనం కూడా వాడ్ని కోప్పడితే వాడెక్కడికి పోతాడు. ఇది ఆలోచించి వాడి వైపు మాట్లాడేదాన్ని. ఇంకేముంది నా పై మా వారు విరుచుకొని పడేవారు. "నువ్వు వాడ్ని నెత్తి కెక్కించుకో ఇహ వాడు ఇక్కడే తిష్ట వేస్తాడు. తరువాత అందరూ మనల్నేమంటారు. నాకు వాడిపైన జాలి వేసింది" వాడేమీ పరాయివాడు కాదు. సొంత అన్న తమ్ముడు. ఆ ఇంటికెప్పుడూ వెళ్ళడు. మనం తప్ప గత్యంతరం లేదు వాడికి. మావారైతే ఒక నాడు అల్టి మేటం ఇచ్చేసారు. "ఈ నెలాఖరులోగా ఉద్యోగం వెతుక్కోపోతే ఈ ఇంట్లో నీకు స్థానం లేదు" అని,

"పెద్ద మరిది ఉద్యోగం కోసం ఇరవై వేలు, ఆడ పడుచు పెళ్లి నిమిత్తం లక్షన్నర ఎక్కడ నుండి తెచ్చాము? వీడు అందరి కంటే చిన్నవాడు గాని ఏ ముద్దు ముచ్చట తీరలేదు. ఇప్పుడు తన కాళ్ళపై నిలబడతానంటే ఎక్కడ నుండేనా ఆ డబ్బు సమకూరిస్తే తప్పేమీ లేదు. మీరు ఒప్పుకుంటే నేను ఏదో ఒక లోన్ తీస్తాను." ఇది విని ఒక్కమారు కసిరేరు. అసలే ఈ ఆర్థిక సమస్యలతో నెట్టుకు రాలేక పోతుంటే ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తోచక బుర్ర చెడిపోతుంటే, అప్పులు ఎలా తీర్చాలో ఆలోచించి బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే నువ్వేమో నాకు సాయం చెయ్యడం లేదు సరిగదా దానవీర శూర కర్ణుడి పెద్ద అక్కలా ముప్పై వేలు తెచ్చిస్తావా వాడికి. మీరిద్దరు నా తల కొరికేయండి. నేను హార్ట్‌ఫెయిల్ పోతాను. అప్పుడు సంతోషంగా ఉందురు గాని." నేను ఇహ నోరు విప్పలేదు. కామ్‌గా వంటింట్లోకి వెళ్ళి పోయాను.

○ ○ ○

భగవంతుడు మాకు గుణపాఠం నేర్పుదామనుకున్నాడు కామోసు. నేను తీవ్రమైన అస్వస్థతకు గురై మంచాన పడ్డాను. స్కూల్‌కి సెలవు పెట్టేసాను. రెండు రోజుల తర్వాత నన్ను ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. నాకు ఎప్పుడూ మా వారు, మధూ గురించే దిగులుగా వుండేది. ఇటువంటి సమయంలో రమేష్ రావడం మాకొక పెద్ద టెన్షన్ తగ్గింది. నాలోటు మధుకి, వాడి నాన్నగార్కి తెలియనివ్వలేదు.

రోజల్లా ఆసుపత్రి నుండి ఇంటికి, ఇంటి నుండి ఆస్పత్రికి, ఇంటి పనంతా చేసి రాత్రి నా దగ్గర డ్యూటీ చేసేవాడు. వాడి ప్రేమ, సేవాభావం నన్ను కరిగించేసాయి. అపరాధ భావన నన్ను వేధించడం మొదలెట్టింది. మా వారు రెండు రోజులు సెలవు పెట్టి నా వద్ద వుందామనుకొనే వీలులేదు. కనీసం రాత్రైనా నా దగ్గర వుండి వాడ్ని రిలీవ్ చేద్దామనుకోలేదు. ఎంతసేపు కాలేజీ, పుస్తకాలు, చదువుకోవడం. అట్లాంటప్పుడు వీడికేం అవసరం. ఇంత చాకిరిచేస్తూ నన్ను అంటిపెట్టుకుందుకు? కబురు పంపినా అత్తగారు గాని ఆడపడుచులు గాని వచ్చి చూసి వెళదామని వాళ్ళకి అనిపించలేదు. వాళ్ళ భయం వాళ్ళది. ఇక్కడికి వస్తే నా సేవ చెయ్యవలసి వస్తుందేమో, వంట వార్పు చెయ్యవలసి వస్తుందేమోనని. అంతేగాని వాళ్ళ కొడుకు, మనవడు ఏం తింటున్నారో, ఎలా వున్నారో నాలుగు రోజులు వుండి వండి పెడదామనిపించనే లేదు. అటువంటప్పుడు వాడెందుకు గుండా పిండీ అవ్వాలి. తన సాయశక్తులా మమ్మల్ని ఏ లోటు లేకుండా చూసుకుంటున్నాడు. నిజం చెప్పాలంటే వాడితో ఇంత సేవ, పని చేయించుకునే హక్కు మాకెక్కడిది? ఇన్ని సుగుణాలతో వున్న వీడు దైవస్వరూపుడు కాడా?

నిజమే ఈ స్వార్థమయ జగత్తులో అన్నీ జరుగుతుంటాయి. పని చేసి జీతం తెచ్చి ఇస్తేనే తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు భోజనం పెడతారు. లేకపోతే ఈ ఇంటా ఆ ఇంటా తిరుగుతూ బ్రతకవలసి వస్తుంది. డబ్బు గడించని వాడిపై ఎంత ఖర్చుపెట్టారో లెక్క కడతారు. రోడ్డుపైకి తరిమి కొట్టడానికి కూడా సంకోచించరు. రమేష్ ప్రేమ, సేవాభావం ఏ త్రాసులో పెట్టి తూచాలి? నన్ను నా ఆత్మ ధిక్కరిస్తోంది.

○ ○ ○

ఇంతలో "అరే వదినా... నువ్వు ఇంకా పడుకోలేదా?" రమేష్ మాటలు నా చెవిలో పడగానే ఉలిక్కిపడ్డాను.

"వదినా ఏంటి ఆలోచిస్తున్నావు? పద, పడుకో నేను దుప్పటి కప్పుతాను. ఆ... ఇప్పుడు నీకొక గుడ్ న్యూస్... నాకు హైదరాబాద్‌లో హోటల్ మేనేజరు ఉద్యోగం దొరికింది" వాడి ముఖంలో వెయ్యి దీపాల కాంతి తళుక్కుమంటూంది. నా కళ్ళు ఆనందంతో సజలాలయ్యాయి. ■